ప్రజాశక్తి
శుక్రవారం 20 జూన్ 2025
5
అల్లూరి సీతారామరాజు

## 42 మందికి వైద్య పరీక్షలు

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అంబిక

**ప్రజాశక్తి -డుంబ్రిగుడ:** మండల కేంద్రంలోని డుంబ్రిగుడలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారిని అంబిక పాల్గొని, శిబిరంలో 42 మందికి ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. వర్షాలు కురుస్తున్నందు జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్యం చేస్తే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, వైద్యం చేయించుకోవాలన్నారు. శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పి శిరీష, ఎఎన్ఎంలు ప్రసన్న, కిరణ్మయి, ,సిబ్బంది పాల్గొన్నారు.

# మాస్టార్ల కోసం ఎదురుచూపులు!

- కొత్త సంవత్సరంలో ఇంకా తెరుచుకోని పాఠశాలలు
- రోజూ బడికివెళ్లి, ఉసూరుమని తిరిగొస్తున్న బాలలు
- టెంకలబంద, వేలమామిడి గ్రామాల్లో విద్యార్థుల నిరసన

**ప్రజాశక్తి -అనంతగిరి :** వేసవి సెలవులు ముగిసి, కొత్త విద్యా సంవత్సరంలో పాఠశాలలు పున్ణ ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా, నేటికీ మన్యంలోని కొన్ని పాఠశాలలు తెరుచుకోలేదు. ఆయా గ్రామాల్లోని గిరివిద్యార్థులు రోజూ పాఠశాలలకు వెళ్లి, మాస్టార్ల కోసం ఎదురుచూడడం, వారు రాకపోవడంతో ఉసూరుమని వెనుదిరగడం వారంరోజులుగా పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో గురువారం టెంకలబంద, వేలమామిడి గ్రామాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన చేపట్టారు.తమ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించి, తమ భవిష్యత్‌కు భరోసానివ్వాలని నినాదాలు చేశారు.

మండలంలోని మారుమూల పెద్దకోట పంచాయతీ, వేలమామిడి. కివర్ణ పంచాయతీ టెంకలబంధ ప్రాథమిక పాఠశాలలున్నాయి. వేలమామిడి పాఠశాలలో 30 మంది పైగా విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఇక్కడ పనిచేసినఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లగా, కొత్తగా వేరెవ్వరినీ నియమించలేదు. దీంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లి రోజంతా వేచిచూసి, టీచర్‌రాకపోవడంతో ఇంటి బాట పడుతున్నారు. ఇక్కడ పనిచేసిన భాష విద్యావాలంటరీ కొనసాగింపుపై విద్యాశాఖ నుండి ఎటువంటి ఆదేశాలు లేకపోవడంతో పాఠశాలకు వెళ్లడం లేదు. దీంతో కొత్త సంవత్సరంలో ఇప్పటివరకు పాఠశాల తెరుచుకోలేదు.

అలాగే టెంకలబంధ పాఠశాలలో 20 మంది విద్యార్థులు చదువుతున్నారు ఈ పాఠశాలకు చీడివలస ఎంపిపి పాఠశాల నుంచి టీచర్ వచ్చి పిల్లలకు పాఠాలు బోధించేవారు. అయితే ఈ ఏడాది ఉపాధ్యాయుడు రాకపోవడంతో పాఠశాలలను తెరిచే దిక్కు లేకుండా పోయింది. దీంతో గురువారం పాఠశాల చిన్నారులంతా ఖాళీ కంచాలను చూపిస్తూ, తమకు విద్యాదానం చేయాలని వేడుకుంటూ వినూత్నంగా నిరసన చేపట్టారు.

ఖాళీ కంచాలతో నిరసన వ్యక్తం చేస్తున్న టెంకలబంద పాఠశాల చిన్నారులు

చదువుకు దూరమైన టెంకలబంద విద్యార్థులు తమ గ్రామం నుంచి చీడివలస పాఠశాలకు వెళ్లాలంటే రెండు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాలి. వర్షాకాలంలో మార్గమధ్యలో ఉన్న ఉప్పొంగి ప్రవహించే గెడ్డ దాటి అక్కడకు తమ పిల్లలను పంపించడం ఇష్టం లేని తల్లిదండ్రులు, తమ గ్రామంలోని పాఠశాలకు మాస్టారును నియమించాలని వేడుకుంటున్నారు. తమ పాఠశాలలకు భవనం లేనప్పటికీ, తల్లిదండ్రులు, గ్రామస్తులంతా స్వచ్ఛందంగా తాత్కాలిక రేకుల షెడ్‌ను కూడా ఏర్పాటు చేశారు.

ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు దీనిపై దృష్టిపెట్టి, తమ గ్రామాల్లోని పాఠశాలలకు మాస్టార్లను నియమించి, తమ పిల్లలు చదువుకు దూరం కాకుండా చూడాలని మొరపెట్టుకుంటున్నారు. టీచర్లు లేక తమ పాఠశాలలు తెరుచుకోక పోవడంతో తమ పిల్లల చదువులు, భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారడంతోపాటు పాఠశాలల్లో ఇచ్చే మధ్యాహ్నభోజనం, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలేవీ తమకు అందడం లేదని వీరంతా వాపోతున్నారు.

టీచర్ కోసం పాఠశాల బయట ఎదురుచూస్తున్న వెలమామిడి గిరిబాలలు

మాస్టార్లు రాక, చదువులు సాగక ఉసూరుమని తరగతి గదుల్లో కూర్చున్న చిన్నారులు

# విద్యాలయాల్లో సౌకర్యాలు కల్పించాలి

- ఎస్ఎఫ్ఐ నాయకులు సిహెచ్.ఐసుబాబు

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేత ఐసుబాబు

**ప్రజాశక్తి అరకులోయ రూరల్:** అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఏ పరిధి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి అదనపు తరగతి గదులు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ మండల నాయకుడు సిహెచ్ ఐసుబాబు. డిమాండ్ చేశారు. గురువారం అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం భవనంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ యోగ సర్వ రోగ నివారిణి కాదని, గిరిజన విద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ యోగ దినోత్సవం పేరుతో గిరిజన ప్రాంతం నుంచి దాదాపు 500 ప్రత్యేక బస్సులలో విద్యార్థులను విశాఖపట్నం తరలించడం చాలా దారుణమన్నారు .యోగాకు పెట్టె నిధులతో గిరిజన ప్రాంతంలో ఆశ్రమ పాఠశాలలో తరగతి గదులు టాయిలెట్స్, తాగు నీటి సదుపాయాలు కల్పిస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. యోగతో విద్యార్థుల ఆరోగ్యం, ఉల్లాసం సమకూరుతుందని భావిస్తే దాన్ని పాఠశాలల్లో నిర్వహించాలన్నారు. పాఠశాల,కళాశాల పరిసరాలు శుభ్రం చేయడానికి ఖాళీగా ఉన్న వాచ్‌మ్యాన్ ,కుక్,హెల్త్ వాలంటీర్ పోస్టులను భర్తీ చేసి విద్యార్థుల ఆరోగ్యం కాపాడాలన్నారు. యోగా పేరుతో ప్రభుత్వం, అధికారయంత్రాంగం నెలరోజులుగా హడావిడి చేస్తోందని, కానీ ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తి పాఠశాల భవనాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపైనా, మూతబడిన పాఠశాలలను తెరిపించడంపైనా దృష్టి పెట్టడం లేదన్నారు. గిరిజన విద్యపై నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో ఎస్ఎఫ్ఐ, ఆదివాసీ గిరిజన సంఘం అధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి జి బుజ్జిబాబు, పి రామన్న పాల్గొన్నారు.

# 21లోగా ప్రత్యేక డిఎస్‌సిపై ప్రకటన చేయాలి

- లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తాం
- ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి సాధన కమిటీ

**ప్రజాశక్తి - పాడేరు:** ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి, ఆదివాసీ ప్రాంతాల్లో శతశాతం విద్య, ఉద్యోగ కల్పనకు సంబంధించి రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవంలోగా స్పష్టమైన ప్రకటన చేయాలని ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి సాధన కమిటీ డిమాండ్ చేసింది. గిరిజన రిజర్వేషన్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జోక్యం చేసుకోవాలన్నారు. ప్రత్యేక డిఎస్‌సి ప్రకటనలపై నిర్లక్ష్యం చేస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గురువారం పాడేరులో విలేకర్ల సమావేశంలో ప్రత్యేక డిఎస్‌సి సాధన కమిటీ జిల్లా కన్వీనర్ సాగేన ధర్మన పడాల్, కో. కన్వీనర్ కూడ రాధాకృష్ణ మాట్లాడుతూ, ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనులకు 100శాతం ఉద్యోగ నియామక రిజర్వేషన్‌కు చట్టం చేయాలని డిమాండ్ చేశారు .అంతరవకు ఏజెన్సీలోని ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా మెగా డిఎస్‌సి నుంచి మినహాయించి, ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. దీనిపై దశలవారీగా, విభిన్నరీతుల్లో పలుధపాలుగా చేపట్టిన ఆందోళనలు, విజ్ఞాపనలకు ఎట్టకేలకు గతనెల 13న సిఎం చంద్రబాబు స్పందించి, వందశాతం గిరిజనులకే ఏజెన్సీలోని ఉద్యోగాలు కల్పించేలా చట్టం చేస్తామని ప్రకటించారని, అయితే, మెగా డిఎస్‌సికి కూడా దాన్ని వర్తింపజేయాలని, మన్యంలోని ఉపాధ్యాయ పోస్టులన్నీ ప్రత్యేక డిఎస్‌సి ద్వారానే పూర్తిగా గిరిజనులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాటపై ఈనెల 21 యోగా దినోత్సవంలోగా స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. విశాఖ రానున్న ప్రధాని మోడీని కలిసేందుకు సాధన కమిటీకి అపాయింట్‌మెంట్ ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు చొరవ చూపాలని కోరారు.

డిఎస్‌సి సాధన కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 22న మండలాల్లో నిరసనలు, 30న రాష్ట్రవ్యాప్తంగా ఐటిడిఎల ముట్టడి, మే ఒకటిన రంపచోడవరంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీతో చర్యలు, మే 2 .3 తేదీలలో రాష్ట్ర మన్యం బంద్, 5న సాలూరులో గిరిజన మంత్రి సంధ్యారాణితో, మే 8న విజయవాడ సిఎంఒలో గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం. నాయక్ ఆధ్వర్యంలో ప్రభుత్వం నియమించిన ఐఎఎస్‌ల బృందంతో సాధన కమిటీ చర్యలు జరిపిందన్నారు. ఇలా గిరిజనం గుండెచప్పుడును ప్రభుత్వానికి ఎరుక చేశామన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ఆదివాసీలకు అన్యాయం జరిగితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆదివాసి స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ జిల్లా కోకన్వీనర్లు తరడ సత్యనారాయణ నాయుడు, మొండిపల్లి చిరంజీవి, గంపరాయి భాను, సిహెచ్ రావు, రాజుబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ధర్మన్నపడాల్, రాధాకృష్ణ

# అల్లూరి విద్యార్థికి రాష్ట్ర స్థాయి యోగాలో మూడోస్థానం

**ప్రజాశక్తి-పాడేరు,:** ఈ నెల 21న అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన యోగ పోటీలలో జిల్లాకు చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయి యోగా పోటీలలో మూడవ స్థానం సాధించిందని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ తెలిపారు. పాడేరు మండలం వంతాడపల్లి గ్రామానికి చెందిన గుజ్జెలి ధాత్రిక వ్యాసరచన జూనియర్స్ పోటీలో రాష్ట్రస్థాయిలో మూడో స్థానం సాధించింది. ఈమె గ్రామ మండల జిల్లా స్థాయిలో గెలపొంది. రాష్ట్రస్థాయిలో పోటీలకు ఎంపికై మూడో స్థానంలో నిలిచిందని కలెక్టర్ వెల్లడించారు.

# మిన్నంటిన రోదనలు

- ★ మావోయిస్టుల మృతదేహాల కోసం కుటుంబీకుల పడిగాపులు
- ★ హైడ్రామా నడుమ అప్పగించిన పోలీసులు
- ★ నేడు కరకవానిపాలెంలో అరుణ అంత్యక్రియలు

మృతదేహాల కోసం ఎదురు చూస్తున్న బంధువులు

**ప్రజాశక్తి - రంపచోడవరం, ఎంవిపి.కాలనీ**

రంపచోడవరం ఏజెన్సీలో బుధవారం జరిగిన ఎదురు కాల్పుల్లో మృతిచెందిన మావోయిస్టుల మృతదేహాలకు రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతుల కుటుంబీకులకు అందజేసే క్రమంలో గురువారం తీవ్ర హైడ్రామా నడిచింది. తమ వారిని కడసారి చూసుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి వేకువజామునకే రంపచోడవరానికి తరలివచ్చిన మావోయిస్టుల బంధుమిత్రులకు పడిగాపులు తప్పలేదు. రోజంతా వారు ఏడుస్తూనే ఉన్నారు. పోస్టుమార్టం నిర్వహించేందుకు ఫోరెన్సిక్ అధికారులు రావాలంటూ పోలీసులు సాయంత్రం వరకూ కాలయాపన చేశారని వారు వాపోయారు. ఇదిలా ఉండగా రంపచోడవరం డిఎస్‌పి సాయి ప్రశాంత్ స్పందిస్తూ మావోయిస్టుల మృతదేహాలను చూసేందుకు అనుమతి ఇవ్వలేదన్న వార్తలు నిజం కాదని అన్నారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరమే మృతదేహాలను బంధువులకు అప్పగించాలని వచ్చిన పై ఆదేశాల మేరకు తాము నడుచుకున్నామని తెలిపారు.

**అరుణ అంత్యక్రియలకు ఏర్పాట్లు**

గురువారం రాత్రి 9 గంటలకు మావోయిస్టు పార్టీ సీనియర్ నాయకురాలు అరుణ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయింది. దీంతో ఆమె కుటుంబీకులకు మృతదేహాన్ని అప్పగించారు. అరుణ అంత్యక్రియలు ఆమె స్వగ్రామమైన విశాఖ జిల్లా కరకవానిపాలెంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని అమరవీరుల బంధు మిత్రులు తెలిపారు.

దిగాలుగా ఎదురు చూస్తున్న అంజు బంధువు

# ఆత్మహత్యకు యత్నించిన యువతి మృతి

**ప్రజాశక్తి-సీలేరు**

పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువతి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై కె.రవీంద్ర తెలిపిన వివరాలు ప్రకారం... జీకే వీధి మండలం గుమ్మరేవుల పంచాయితీ మాదిగమల్లు గ్రామానికి చెందిన కుయిలంగి కావేరి (20) ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. ఇటీవల ఆమెకు టైఫాయిడ్ జ్వరం రాగా, దారకొండ పిహెచ్‌సికి తరలించారు. అయితే ఆమె చికిత్స పొందడానికి నిరాకరించింది. మళ్లీ ఆస్పత్రికి తీసుకెళ్లి ఇంజక్షన్ వేసి వైద్యం చేయిస్తారని భావించిన కావేరి గత నెల 27న తెల్లవారుజాము 3 గంటల సమయంలో కుటుంబ సభ్యులు గాఢ నిద్రలో ఉన్నప్పుడు పంట పొలాలకు ఉపయోగించే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఇది గ్రహించిన తల్లిదండ్రులు వెంటనే అప్రమత్తమై ఒరిస్సా మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. అనంతరం అక్కడ వైద్యులు సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం మల్కన్‌గిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కావేరి పరిస్థితి కొంతమేరకు మెరుగుపడడంతో తిరిగి వారి స్వగ్రామం మాదిగమల్లు తీసుకువచ్చారు. మళ్లీ ఈనెల 1న కావేరికి కడుపునొప్పి తీవ్రంగా ప్రారంభమైంది. చింతపల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, నర్సీపట్నం ఏరియా హాస్పిటల్‌కి రిఫర్ చేశారు. నర్సీపట్నంలో వైద్య సేవలు అందించి మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు కెజిహెచ్ భవాని వార్డుకు షిఫ్ట్ చేసి వైద్య సేవలు అందించారు. రెండు రోజుల తర్వాత కావేరి తల్లిదండ్రులు ఎవరికి చెప్పకుండా కుమార్తెను తమ గ్రామానికి తీసుకొచ్చేశారు. అనంతరం కావేరి ఆరోగ్యం మరింత క్షీణించడంతో మళ్లీ కేజీహెచ్‌కు వైద్య సేవలు నిమిత్తం బుధవారం తల్లిదండ్రులు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున 3 గంటలకు కావేరి మరణించింది. దీనిపై కావేరి తండ్రి కుయిలంగి సొన్ను సీలేరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కే రవీంద్ర తెలిపారు.

కావేరి (ఫైల్‌ఫొటో)

# 18 నెలలుగా అందని జీతాలు

## ఆర్థిక ఇబ్బందులు పడుతున్న సత్యసాయి వాటర్ ప్రాజెక్టు కార్మికులు

**ప్రజాశక్తి-దేవీపట్నం :** శ్రీసత్య సాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టులో పని చేస్తున్న కార్మికులకు 18 నెలలుగా జీతాలు చెల్లించలేదు. దీంతో కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ జీవనం కష్టతరంగా మారింది. శ్రీసత్య సాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు ద్వారా 5 మండలాల్లో సుమారు 85 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారు. 53 మంది లైన్ టు కార్మికులు రాత్రి పగలు తేడా లేకుండా తాగునీరు సరఫరా చేస్తున్నారు. ప్రాణాంతకమైన కరోనా సమయంలో కూడా ప్రజలకు మంచినీరు అందించారు, అలాంటి కార్మికులకు సుమారు 18 నెలలుగా జీతాలు, పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించడం లేదు. దీంతో తమ కుటుంబాలు ఆకలితో పస్తులు ఉండాల్సి వస్తుందని కార్మికులు వాపోతున్నారు. ప్రాజెక్టు మెయింటినెన్స్ కూడా అస్తవ్యస్తంగా తయారైంది. పంపులు, మోటార్లు చెడిపోయాయి. పైపులైన్లు తుప్పు పట్టిన ఎక్కడికక్కడ లీకులవుతున్నాయి. కార్మికులు చెడుపోయిన యంత్ర సామాగ్రితో తిప్పలు పడుతూ తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయినా వీరికి జీతాలు మాత్రం చెల్లించడం లేదు. ఒక పక్కన బడులు తెరిచిన పిల్లలను బడుల్లో చేర్పించాలంటే ఫీజులు కట్టలేని పరిస్థితి. మరి ఇలాంటి దయనీయమైన పరిస్థితిలో ఉన్న సత్యసాయి మంచినీటి పథకం కార్మికులకు పూర్తిస్థాయి బకాయి జీతాలు అందించేలా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తేవాలని కార్మికులు కోరుతున్నారు.

సత్యసాయి వాటర్ పథకం

విద్యా మిత్ర కిట్లు అందజేసిన దృశ్యం

## విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి కిట్లు పంపిణీ

**ప్రజాశక్తి-మారేడుమిల్లి**

మారేడుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లు (పుస్తకాలు, బాగ్స్, స్టేషనరీ)ను ఎంపీపీ లలిత కుమారి, జెడ్పిటిసి సభ్యులు బాలాజీ బాబు చేతులమీదుగా గురువారం పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.చిన్నబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిపి, జెడ్‌పిటిసి మాట్లాడుతూ విద్యా మిత్రా కిట్లు వినియోగించుకుని మంచిగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్కొండ రవికుమార్, సర్పంచ్ కొండ జాకబ్, ఉప సర్పంచ్ బొడ్డేటి వీరబాబు, కో ఆప్షన్ సభ్యులు ధర్మరాజు, దూడ సువర్ణ కర్ణకుమార్, టిడిపి మండల ఉపాధ్యక్షులు మల్ల దుర్గాప్రసాద్, జనసేన మండల అధ్యక్షులు భీశెట్టి అప్పాజీ, ఎటిడబ్ల్యూఓ రామతులసి, ముత్యాలరావు, విద్యా కమిటీ చైర్మన్ విజయశాంతి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా గంగాలమ్మ జాతర

**ప్రజాశక్తి గంగవరం :** గంగవరం మండల కేంద్రం ప్రెసిడెంట్ వీధి వద్ద గురువారం మాజీ ఎంపీటీసీ కోసు బుల్లియమ్మ ఆధ్వర్యంలో గంగాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి గ్రామదేవతకు పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. చిన్నారులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తీగల ప్రభ, కోసు రమేష్, దిండి నాగ మహేష్, కట్రం చెన్నాలరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

**ప్రజాశక్తి-మోతుగూడెం :** చింతూరు మండలం, మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు, మల్లవరం గ్రామం మధ్యలో గురువారం జరిగిన షార్ట్ సర్క్యూట్ వల్ల కారు దగ్ధమైంది. అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం కొత్తపాలెం గ్రామం నుంచి వచ్చిన పర్యాటకులు సాయంత్రం వారి కారును రోడ్ పక్కన నిలిపి ఉంచారు. ఆ సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంజన్ నుండి మంటలు చెలరేగి అవి కారు మొత్తం వ్యాపించాయి. కారు పూర్తిగా దగ్ధమైంది. మోతుగూడెం పోలీసులకు సమాచారం ఇవ్వగ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని పోలీసులు తెలిపారు.

## ఆరోగ్య పరిరక్షణపై అవగాహన

**ప్రజాశక్తి-సీలేరు**

సీలేరు కాంప్లెక్స్ పరిధి ఏపీ జెన్కో సీలేరు కళ్యాణ మండపంలో ఆరోగ్య పరిరక్షణపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జెన్‌కో విజయవాడ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్ ఆధ్వర్యాన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి డాక్టర్ అశోక్ పక్షవాతవం వచ్చినప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి ప్రమాదాల సమయంలో ప్రథమ చికిత్స ఎలా చేయాలో తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిత్వాన్ని ఎలా పెంపొందించుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏడిఈ క్రాంతి, ఈఈలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, ఏడిఈ జైపాల్, ఏఈలు సిహెచ్ సురేష్, అనుదీప్, ఓ అండ్ డామ్ ఏడీఇలు, ఏఇలు, జెన్కో కార్మికులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అశోక్

విత్తనాలను అందజేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త బయ్యపు రెడ్డి

## గిరి రైతులకు వలిసె విత్తనాల పంపిణీ

**ప్రజాశక్తి- జికె వీధి:** మండలంలోని రింతాడ పంచాయతీ దుచ్చరపాలెం గ్రామంలో 30 మంది రైతులకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో మూడేసి కిలోల వలిసె విత్తనాలను, జీవన ఎరువులును శాస్త్రవేత్త బయ్యపు రెడ్డిపంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సేంద్రియ వ్యవసాయ సాగు పద్ధతులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో పీసా కమిటీ అధ్యక్షులు సాగిన భీమేశ్వర్ పడాల్,దత్తత గ్రామ రైతులు సాగిన జోగి పడాల్, గుమ్మల రాంబాబు, వంతల గోపి, బంగార్రజు లక్ష్మీ పడాల్, నారాయణ, రామచంద్ర బ్రహ్మాజీ, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైస్ ఎంపిపి ఆనందరావు

## సంక్షేమం, సౌకర్యాలు కల్పనే లక్ష్యం

### - పెదవలసలో ధర్తి ఆభ జన్‌భగీదరి అభియాన్ గ్రామసభ

**ప్రజాశక్తి - జీకే వీధి:** గిరిజన గ్రామాల్లో సమస్యలను పరిష్కరించి, మౌలిక సౌకర్యాల కల్పనే ధర్తి ఆభ జన్‌భగీదరి అభియాన్ పథక లక్ష్యమని పంచాయతీరాజ్ మండల జెఇఇ జ్యోతిబాబు అన్నారు. గురువారం మండలంలోని పెదవలస గ్రామంలో జన్‌జాతీయ గౌరవ్‌వర్ష్ వేడుకల్లో భాగంగా గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ నందర్భంగా వైస్ ఎంపిపి చెప్పగడ్డ ఆనందరావు మాట్లాడుతూ . ఆధార్, ఉపాధి హామీ జాబ్‌కార్డు, రేషన్‌కార్డు, ఆయుష్మాన్, భారత్, పీఎం కిసాన్ ఇతరత్రా ప్రభుత్వ పథకాలను అర్హులైన వారందరికీ అందించడంతోపాటు గ్రామంలో కనీస మౌలిక సౌకర్యాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా స్థానికులు వ్యక్తిగత సమస్యలతోపాటు తాగునీరు, రహదారులు ఇతర సౌకర్యాలను కల్పించాలని గ్రామసభలో కోరారు. సర్పంచ్ పాంగి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో కూటమి నాయకులు పండ్ర నూకరాజు, పోతరాజు మోహనరావు, బొండ్ల చిరంజీవి, పంచాయతీ సెక్రటరీ కిల్లంగి బాలకృష్ణ, విఆర్ఒ వి సత్యమణి, అగ్రికల్చర్ అసిస్టెంట్ రవీంద్ర పాల్గొన్నారు.

## ఎయుకు బ్రెస్ట్ కేన్సర్ ఔషధంపై పేటెంట్

**ప్రజాశక్తి- విశాఖపట్నం :** ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన ఇంజినీరింగ్ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ బి.కిషోర్‌బాబు, వారి పరిశోధనా బృందం (అప్పారావు, స్వర్ణలత, వీర్రాజు, గోపి, ఫణి) బ్రెస్ట్ కేన్సర్ చికిత్సకు అభివృద్ధి చేసిన నూతన నాఫ్తాలిమైడ్ డెరివేటివ్ సమ్మేళనానికి భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం 20 సంవత్సరాల కాలానికి పేటెంట్ మంజూరు చేసింది. ఈ సమ్మేళనం నిర్దిష్టమైన బ్రెస్ట్ కేన్సర్ కణాలపై మెరుగైన ప్రభావాన్ని చూపడం, తక్కువ దుష్ప్రభావాలు కలిగి ఉండటం, డ్రగ్-రెసిస్టెంట్ కణాలను లక్ష్యంగా చేసుకునే ప్రత్యేకమైన పని విధానాన్ని కలిగి ఉండటం వంటి అనేక ప్రయోజనాలను కలిగి ఉంది.

# పిఎం జన్‌మన్ ఇళ్ల బిల్లు బకాయిలు చెల్లించాలి

**- ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్**
**- 27న పాడేరు ఐటిడిఎ వద్ద ధర్నా**
**- ఆందోళన జయప్రదానికి విస్తృత ప్రచారం**

**ప్రజాశక్తి- అరకు లోయ:** పిఎం జన్‌మన్ ఇళ్ల బిల్లు బకాయిలు చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. ఇళ్ల బిల్లుల కోసం ఈనెల 27న పాడేరు ఐటిడిఎ వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం : అరకులోయ మండలం చినలబుడు పంచాయతీ గొందివలస గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు.
ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ, పిఎం జన్‌మన్ హౌసింగ్ పథకం కింద నిర్మించిన శ్లాబ్, లింటెల్ లెవెల్ నిర్మాణంలో ఉన్న ఇళ్లకు బిల్లులు చెల్లించాల్సి ఉందని, ఈ మేరకు పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో రూ.21 కోట్ల 54 లక్షలు బిల్లు బకాయి చెల్లించాలని డిమాండ్ చేశారు. హౌసింగ్ అధికారులకు ముడుపులిస్తేగానీ ఇళ్ల బిల్లులు మంజూరు చేయడం లేదన్న లబ్ధిదారుల ఆరోపణలపై విచారణ చేపట్టి బాధ్యులపై తగు చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు, బిల్లుల చెల్లింపుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండాలని కోరారు. పాడేరు ఐటిడిఎపరిధిలో 2.0 హౌసింగ్ సర్వేచేసి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఇల్లులు మంజూరు చేయలేదన్నారు. పెరిగిన గృహనిర్మాణ సామగ్రి ధరలకు అనుగుణంగా పిఎం జన్‌మన్ ఇళ్లకు ప్రభుత్వం రూ.పది లక్షల ఆర్థికసాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ముసిరి మల్లన్న, ప్రకాశరావు, సాంబ మూర్తి, నాగేశ్, రాజారావు, కృష్ణ, ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న బాలదేవ్

# విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

**- జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్**

మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

**ప్రజాశక్తి-చింతపల్లి:** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గిరిజన సహకార సంస్థ రాష్ట్ర చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో విద్యారంగ అభివృ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గురువారం టిడిపి పాడేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరితో కలిసి చింతపల్లిలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాకూరు సత్యనారాయణ రాజు అధ్యక్షతన విద్యార్థులతో సమావేశమయ్యారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మెనూను క్రమంగా అమలు చేస్తామని చెప్పారు. పాఠశాలల విద్యార్థుల శుభ్రత దృష్ట్యా జిసిసి ద్వారా ప్రతినెలా సబ్బులు, నూనెలు పంపిణీ చేస్తామని, సన్న బియ్యంతో భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు, ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. 'సూపర్ సిక్స్' హామీల అమలులో భాగంగా 'తల్లికి వందనం' పథకం ద్వారా చదువుకుంటున్న అందరు పిల్లలకు వారి తల్లుల ఖాతాల్లో ఆర్థికసాయం అందజేశామన్నారు. వైసిపి హయాంలో కుటుంబంలో ఒక్కరికే అమ్మఒడి సాయం ఇవ్వగా, కూటమి పాలనలో పిల్లలరందికీ తల్లికి వందనం సాయం అందజేస్తున్నామన్నారు.
ఈ నెల 21న విశాఖపట్నంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విద్యార్థులు, ప్రజలు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**పజా పంపిణీ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం.**

ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలోని డిఆర్ డిపోను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పంపిణీ వ్యవస్థను పారదర్శకంగా, సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు.
కార్యక్రమంలో ఎంపిపి కోరాబు అనూష దేవి, సర్పంచ్‌లు దురియా పుష్పలత, పాంగి పాండురంగసామి, బాకూరు వెంకటరమణరాజు, పలాసి శశిభూషణం నాయుడు, తామర్ల సత్యనారాయణ, సునీల్‌కుమార్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్‌వల్లి, జనసేన మండలాధ్యక్షుడు వంతల బుజ్జిబాబు, ఉపాధ్యక్షుడు కిముడు కృష్ణమూర్తి (పండు), టిడిపి మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, టిడిపి నాయకుడు లక్ష్మణరావు, సాగర సుబ్బారావు, తుడుము సుబ్బారావు, మండ్యాగురు స్వామి, త్రినాధ్, అచ్చిబాబు, జంపారంగి తిరుపతిరావు, జక్కయ్య పాల్గొన్నారు.

గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

## క్షయపై అవగాహన అవసరం

**ప్రజాశక్తి -అనంతగిరి :** ధూమపానం, మద్యపానం వ్యసనాలున్న వారికి క్షయవాధి సోకే అవకాశం ఎక్కువగా ఉందని క్షయవ్యాధి నిర్మూలన విభాగం సూపర్‌వైజర్ సదానందం సూచించారు. గురువారం డిఎంహెచ్ఒ డాక్టర్ జమాల్‌భాషా ఆదేశంలో పినకోట ఆరోగ్య కేంద్రం పరిధిలోని జీనబాడు పంచాయతీ, జీనపాడు, పి గంగవరం, పాలబంధం, దెబ్బపాలెం గ్రామాల్లో టిబి ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా క్షయ వ్యాధిపై అవగాహన కల్పించాచారు.
ఈసందర్భంగా సదానందం మాట్లాడుతూ, అరవై ఏళ్లు పైబడిన వారు, మధుమేహం ఇతర వ్యాధులున్నవారు, మద్యం, పొగాకు ఉత్పత్తులు తీసుకునే అలవాటున్న వారు రెగ్యులర్‌గా చెకప్ చేయించుకోవాలన్నారు. రెండువారాలకు మించి దగ్గు, శరీర బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలున్న వారుకఫం పరీక్షలు చేయించుకోవాలన్నారు. టిబి రోగులున్న కుటుంబీకులు కూడా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం అవసరమని, వ్యాధి నిర్ధారణ జరిగితే ప్రభుత్వం ఉచితంగానే మందులతోపాటు వారికి పౌష్టికాహారం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ సూపర్వైజర్ నగేష్ దొర, హెల్త్ అసిస్టెంట్ బి రామరాజు, ఎంఎల్‌హెచ్‌పి పికె.తులసి, ఎఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## గిన్నిస్ బుక్ రికార్డు సాధనే లక్ష్యం

### -నేడు ఎయు ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో గిరిజన విద్యార్థుల సూర్య నమస్కారాలు

### జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

**ప్రజాశక్తి -పాడేరు** : విశాఖలోని ఎయు ఇంజనీరింగ్ కళాశాల మైదానం వేదికగా ఏజెన్సీ నుంచి 26,395 మంది గిరిజన విద్యార్థులతో సూర్య నమస్కారాలు నిర్వహించి గిన్నిస్ బుక్ రికార్డ్‌కు చర్యలు తీసుకున్నట్లు అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ వెల్లడించారు. 106 పాఠశాలలకు చెందిన గిరిజన విద్యార్థులను దీనిలో భాగస్వామ్యం చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులందరినీ 495 బస్సులలో తరలింపునకు ఏర్పాట్లు చేసామన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 20న శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో సూర్యనమస్కారాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటి, విద్య, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ పాల్గొనే అవకాశం ఉందన్నారు.
21న విశాఖ బీచ్‌రోడ్డులో ప్రధానమంత్రి మోడీ సమక్షంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఐదు లక్షల మందితో యథావిధిగా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సూర్యనమస్కారాల్లో పాల్గొనే విద్యార్థులంతా యోగాడేలోనూ పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు.

## యోగా జనసమీకరణకు ప్రత్యేక బస్సులు

**ప్రజాశక్తి- చింతపల్లి:** 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులను విశాఖపట్నానికి తరలించేందుకు చింతపల్లి నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏపీఎస్ ఆర్టీసీ చింతపల్లి డిపో ద్వారా మొత్తం 13 స్పెషల్ బస్సులను సిద్ధం చేశారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బాలుర, బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలల నుంచి సుమారు 800 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి విశాఖపట్నంలో నిర్వహించనున్న యోగా వేడుకలకు హాజరవుతారు. ఈ తరలింపులో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర ఏర్పాట్లు చేపట్టారు.

మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

## ఆర్‌టిసికి కొత్తగా 1400 బస్సులు రాక

### - రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** రాష్ట్రంలో ఆర్‌టిసికి 1400 కొత్త బస్సులు వచ్చాయని, త్వరలో మరికొన్ని ఎలక్ట్రికల్ బస్సులతో పాటు డీజిల్ బస్సులు కూడా వస్తాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. విశాఖలోని ద్వారకా బస్ కాంప్లెక్స్‌లో గురువారం సాయంత్రం సిసి కెమెరాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విశాఖపట్నానికి కేటాయించిన 100 ఎలక్ట్రికల్ బస్సులలో 50 బస్సులు సింహపురి కాలనీ డిపోలోనూ, 50 బస్సులు గాజువాక డిపోలోనూ ఏర్పాటుచేసి ప్రయాణికుల అవసరాలు తీర్చవచ్చన్నారు. విశాఖపట్నం జిల్లాలో మరికొన్ని బస్సులు పెంచి ప్రయాణికుల అవసరాలు తీర్చే విధంగా చర్యలు తీసుకోనున్నామన్నారు. ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు మాట్లాడుతూ విశాఖ జిల్లాకు 60 బస్సుల వరకు గతంలో తిప్పిన రూట్లలో, ముఖ్యంగా 900, 14, 28, 288 మొదలగు రూట్లలో కొత్తగా వచ్చిన ఎలక్ట్రికల్ బస్సులు నడిపి ప్రయాణికుల అవసరాలు తీరుస్తామన్నారు. 1,25,000 మంది విద్యార్థులకు స్టూడెంట్ బస్సు పాసులను ఈ సంవత్సరం జారీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెఎస్.బ్రహ్మానంద రెడ్డి, విశాఖపట్నం డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ ఎం.సుధాబిందు, ద్వారకా బస్ స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పిబిఎంకె.రాజు, పర్సనల్ ఆఫీసర్ జె. తిరుపతి, విజిలెన్సు, సెక్యూరిటీ ఆఫీసర్ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

## రెండు వారాలుగా నిలిచిన విద్యుత్ సరఫరా

**ప్రజాశక్తి-సీలేరు :** జీకే వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ గుమ్మరేవుల పరిసర గ్రామాల్లో రెండు వారాల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయి సుమారు 30 గ్రామాల గిరిజనులు చీకట్లో కాలం వెల్లదీస్తున్నారని బిఎల్ఓ రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర మార్కురాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో తరచూ సాంకేతిక లోపాలు తలెత్తి ఇబ్బందులు గురవుతున్నామని వాపోయారు. వర్షం పడినా, పడకపోయినా విద్యుత్ సరఫరా తరచూ నిలిచి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను పరిష్కరించడంలో ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల విద్యుత్ స్తంభంపై చెట్టు విరిగిపడితే గిరిజనులే ట్రాన్స్‌కో సిబ్బందికి సహాయ సహకారాలు అందించాలని గుర్తు చేశారు. పంచాయతీ పరిధిలో 30 గ్రామాలు చీకటమయంగా మారాయని, రాత్రి సమయంలో అడవి జంతువులు, విషకీటకాలు వలన ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించకపోతే పాడేరు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## యోగాపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాశక్తి - సీలేరు :** జీకే వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపు ఎంపీపీ స్కూల్లో యోగాపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేశారు. విద్యార్థుల చేత పలు యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు భగీరథ మాట్లాడుతూ ఈనెల 21న విశాఖలో యోగాంధ్ర కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఇందులో భాగంగానే విద్యార్థులకు యోగాపై తర్ఫీదు ఇచ్చామన్నారు. శరీరంలో ఉన్న రుగ్మతులను దూరం చేయడానికి యోగా ఎంతో దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో భాషా వాలంటీరు నాగమణి, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 7295 బస్సులు.. 5 లక్షల మంది ప్రజలు

**యోగా డేకు భారీగా జన సమీకరణ**
**సచివాలయం యూనిట్‌గా వాహన కేటాయింపులు**
**26 కిలోమీటర్ల మేర యోగా విన్యాసాలు**
**యోగాంధ్ర ఏర్పాట్లపై సమీక్షల్లో మంత్రులు నారాయణ, డోలా**

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ**

ఈ నెల 21న యోగాంధ్ర కార్యక్రమానికి తరలివచ్చే లక్షలాది మంది ప్రజలకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ పకడ్బందీగా చేపడుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. సుమారు ఐదు లక్షల మంది ప్రజలు విశాఖకు తరలివస్తారన్న అంచనా ఉండటంతో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఎప్పటికప్పుడు అధికారులకు దిశానిర్దేశం చేస్తోంది. 7295 బస్సులను జన సమీకరణకు సిద్ధం చేసినట్టు వెల్లడించింది. మరోపక్క విశాఖలో గురువారమంతా రాష్ట్ర మంత్రులు పి.నారాయణ, డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి వరుస సమీక్షలు జరిపారు. ఆయుష్ శాఖ, విశాఖ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఉదయం ఎయు కన్వెన్షన్ హాలు నుంచి విశ్వప్రియ ఫంక్షన్ హాలు వరకు యోగా వాక్‌థాన్ కూడా చేపట్టారు. ఈ కార్యక్రమంలో డోలాతో పాటు మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో వాక్‌థాన్‌లో పాల్గొన్న మంత్రులు

ఏర్పాట్ల కమిటీలతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి నారాయణ

తొలుత టిడిపి విశాఖ జిల్లా కార్యాలయంలో నారాయణ సహచర మంత్రులతో కలిసి పార్టీ నేతలకు పలు అంశాలపై సూచనలు చేశారు. శనివారం ఉదయం 6.30కి యోగా డే కార్యక్రమం ప్రారంభం కానుండటంతో 5.30లోపు ప్రజలంతా వారికి కేటాయించిన కంపార్ట్మెంట్‌లకు చేరుకునేలా చూడాలన్నారు. 5.45 గంటల తర్వాత ప్రజలను అనుమతించడంలో ఇబ్బందులు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు.
ఆ తర్వాత ఎయు కన్వెన్షన్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుకున్న మంత్రి నారాయణ రవాణా, ఫుడ్ కమిటీలోని సభ్యులతో సమావేశయ్యారు. ఒక్కో సచివాలయాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ప్రజలకు రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. 7295 బస్సులను ప్రజల కోసం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అయితే బస్సులను ఒకేసారి కాకుండా ట్రాఫిక్‌కు తగినట్లుగా చేరుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆ తర్వాత విశాఖపట్నం పోలీస్ కమిషనర్ సంకబ్రత బాగ్చీతో సమావేశమయ్యారు. పెద్ద ఎత్తున బస్సుల్లో ప్రజలు తరలి వస్తుండటంతో తగిన పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఒకేసారి బస్సులు వచ్చే అవకాశమున్నందున ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని సూచించారు. కార్యక్రమం ముగిసి తిరిగి వెళ్లేటప్పుడు కూడా బస్సులను ట్రాఫిక్‌కు అనుగుణంగా పంపించాలన్నారు. అనంతరం మంత్రులు పార్థసారథి, దుర్గేశ్, అధికారులతో కలిసి కంపార్ట్మెంట్ ఇన్చార్జిల మీటింగ్‌కు నారాయణ హాజరయ్యారు.

# బదిలీల్లో పారదర్శకత ఏదీ ?

**కెజిహెచ్ ఎదుట హెడ్ నర్సుల నిరసన**

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** ఇటీవల జరిగిన వైద్య ఆరోగ్యశాఖ హెడ్ నర్సుల బదిలీల్లో పారదర్శకత లోపించిందని, ఈ నేపథ్యంలో ఇప్పటికే జరిగిన కౌన్సెలింగ్‌ను రీ కాల్ చేసి ఆఫ్ లైన్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నగరంలోని పలు ప్రభుత్వ ఆసుపత్రులకు చెందిన హెడ్ నర్సులు కెజిహెచ్ వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం 50 సంవత్సరాలు దాటిన ఉద్యోగులను వయస్సు ప్రాతిపదికన ఏజెన్సీ ప్రాంతాలకు బదిలీలు చేయరాదని, కానీ 58 సంవత్సరాలు దాటిన సుమారు 55 మంది మహిళా సిబ్బందిని విశాఖ నుండి ఏజెన్సీ ప్రాంతాలకు బదిలీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమలో కొంతమందికి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, అదే విధంగా ఉద్యోగ విరమణకు కూడా అతి తక్కువ సమయం ఉందని, అయినప్పటికీ తమ విజ్ఞాపనను పరిగణలోకి తీసుకోకుండా వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ అధికారి ఏకపక్షంగా కౌన్సెలింగ్ నిర్వహించారని అన్నారు. ఆ సమయంలో తమను మాట్లాడనీయకుండా కంప్యూటర్‌ను మ్యూట్ చేసి బదిలీలు తమకు నచ్చినట్టే చేస్తామని, వెంటనే బదిలీ ఆమోద పత్రాలు తీసుకోవాలని తమపై ఒత్తిడి తీసుకువచ్చారని తెలియజేశారు

నిరసన తెలుపుతున్న హెడ్ నర్సులు

## సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహనా ర్యాలీలు

పాడేరులో నిర్వహిస్తున్న అవగాహనా ర్యాలీ

**ప్రజాశక్తి-పాడేరు టౌన్:** వారసత్వంగా సంక్రమించే సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉన్నప్పుడే ఆ వ్యాధిని నిర్మూలించ డానికి అవకాశం ఉంటుందని డిఎంహెచ్ఒ డాక్టర్ జమాల్ బాషా తెలిపారు. గురువారం ప్రపంచ సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా పాడేరులో మినుములూరు పిహెచ్‌సి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత బస్‌స్టాండ్ అంబేద్కర్ కూడలి నుండి ఐటిడిఎ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ సికిల్‌సెల్ అనీమియా వ్యాధి లక్షణాలు సాధారణంగా ఆరు నెలల వయస్సులో ప్రారంభమవుతాయని,లక్షణాలను బట్టి వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నివారించవచ్చన్నారు. వ్యాధిపై నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణాలు సైతం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. జిల్లాలో 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఇప్పటి వరకు మొత్తం 4,10,380 మందికి సికిల్‌సెల్ వ్యాది ఉచిత నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 3,80,685 మందికి నెగెటివ్ రిపోర్టు వచ్చిందన్నారు. సికిల్ సెల్ ట్రైట్ 12,599 మందికి రాగా, సికిల్ సెల్ వ్యాధి 14,088 మందికి నిర్ధారణ జరిపి ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అర్హులైన వ్యాధిగ్రస్తులకు సరైన పౌష్టికాహారానికి ప్రతినెలా రూ.పదివేలు నగదు ప్రోత్సాహం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎడిఎంహెచ్ఒ డాక్టర్.టి.ప్రతాప్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, ప్రోగ్రామ్ మేనేజ్మెంట్ అధికారి డాక్టర్ ఎం.కిరణ్ కుమార్, మినుములూరు పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్.వి.సాయి, వైద్య సిబ్బంది గుల్లేలి సింహాద్రి, టి.ఈశ్వరమ్మ, యం.సరోజినీ, నేచర్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ యం.శిల్ప, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.

**చింతపల్లి:** సికిల్‌సెల్ అనీమియా వారోత్సవాల సందర్భంగా మండలంలోని అంతర్ల ఆరోగ్య ఉపకేంద్ర పరిధిలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. 150వ జన్ జాతీయ గౌరవ్ వర్ష్ వేడుకలలో భాగంగా నిర్వహించినకార్యక్రమానికి ఆర్.వి.నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజా రవీంద్రనాథ్ చౌదరి హాజరై, సికెల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన కల్పించారు ర్యాలీ అనంతరం అంతర్లలో గ్రామసభ, ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో టిబి సూపర్వైజర్ సిహెచ్. ప్రసాద్, ఎఎన్ఎం కోపూరు విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి ఇ. లక్ష్మి, ఆరోగ్య సహాయకుడు సెగ్గే ప్రకాష్, అంగన్వాడి కార్యకర్తలు పుట్టపల్లి నాగరత్నం, గడుతూరి విజయరాణి, రాటా నూకరత్నం, వంతల కొండమ్మ, ఆశ కార్యకర్తలు తూబెరి నూకరత్నం, కంకిపాటి రాజేశ్వరి, కవడం శ్రీదేవి, గుంట సంధ్య, గెమ్మెలి బాలమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

**దుంబ్రిగుడ:** సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై గురువారం మండల కేంద్రంలోని మూడు రోడ్ల జంక్షన్ నుంచి వైద్యాధికారి పి రాంబాబు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారి వివరించి, పలు సలహాలు,సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ శౌరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**విఆర్.పురం :** ప్రపంచ సికిల్ సెల్ అవెర్‌నెస్ డే సందర్భంగా రేఖపల్లి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో డాక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త హీనత, కళ్ళు పసుపు రంగులోకి మారటడం, తీవ్రమైన ఒళు నొప్పులు, కీళ్ల నొప్పులు, అలసట రావట్టం, పెరుగుదల సమస్య వంటి లక్షణాలు ఈ వ్యాధి ఉన్న వారిలో కనిపిస్తాయని చెప్పారు. నిర్ధారణ కోసం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో రక్త పరీక్ష చేయించుకోవాలని సూచించారు. గిరిజన ప్రాంతంలో 40 సంవత్సరాల లోపు వయస్సు ఉన్నవారందరూ సికెల్ సెల్ ఎనిమియా పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయుర్వేదం డాక్టర్ స్వర్ణలత, పీహెచ్‌ఏ భద్రకాళి, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాలు పాల్గొన్నారు.

**మారేడుమిల్లి :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం సికిల్ సెల్ వ్యాధిపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ శకుంతల, ఏఎన్ఎంలు వాహిని, రత్నకుమారి, హెల్త్ అసిస్టెంట్ ఎల్.ప్రభావతి, ఆశా వర్కర్ రాజ్యలక్ష్మి, స్టాఫ్ నర్సులు హేమలత, నూకరత్నం పాల్గొన్నారు.